ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వార్తలు
ఆదివారం 21 జూలై 2024 | 5





మండపేటలో మునిగిన వరి నారును చూపిస్తున్న రైతులు



మండపేట, ఆలమూరు రోడ్డులో చెరువును తలపిస్తున్న పంట పొలాలు



ముమ్మిడివరం మండలం కొత్తలంకలో నీట మునిగిన వరి పొలం

చేలు..చెరువులు

పాలాలను ముంచేసింది..



రావులపాలెం మండలంలో ముంపునీటిలో ఉన్న వరి పొలాలు

రావులపాలెం, జూలై 20: ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తుండడంతో వరి పొలాలు ముంపు నీటిలో ఉన్నాయి. రావులపాలెం మండలంలో గత మూడు రోజుల నుంచి అల్పపీడనం ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో పంట పొలాలు చెరువులను తలపించే విధంగా ఉన్నాయి. మురుగు డ్రైయిన్లు పొంగి ప్రవహించడంతో పంట పొలాల్లో ముంపు దిగే మార్గమే కనిపించడంలేదు. దీంతో నాట్లు, నారుమడులు దెబ్బతింటాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అదే విధంగా పలు రహదారులు వర్షానికి ఛిద్రమయ్యాయి. గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

జల దిగ్బంధంలో..



ఆత్రేయపురం మండలం మెర్లపాలెం సమీపంలో ఇలా..

ఆత్రేయపురం, జూలై 20: వాయిగుండం ప్రభావంతో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరి నాట్లు ఆకుమడులు వర్షానికి మునిగిపోవడంతో పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పంటబోదెల ద్వారా ముంపునీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయలు, ఆకుకూరల పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముంపు ప్రాంతాల్లో నివాస గృహాలకు వెళ్లే రహదారులు బురదమయమయ్యాయి.

ముంపులో పొలాలు

మండపేట, జూలై 20: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండపేట ఆలమూరు రోడ్డులో పొలాలు చెరువులా మారాయి. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గ పరిధిలో పలుచోట్ల పంట చేలు ఇంకా నీటిలోనే మునిగి ఉన్నాయి. మరోపక్క మురుగు కాల్వలు ఆక్రమణలకు గురికావటం గుర్రపుడెక్కతో నిండిపోవటంతో మురుగు నీరు పొంగి ప్రవహిస్తోంది. తుల్యభాగ, గొడ్డు కాల్వలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండపేట మండలం కేశవరంలో ఉన్న గనిపోతురాజు చెరువు భారీ వర్షాలకు పొంగి ప్రవహిస్తోంది. మండపేట, అనపర్తి పరిసర ప్రాంతాల నుంచి కేశవరం కాజ్‌వేపై రాకపోకలు సాగించే వారిని నిలుపుదల చేశారు. కాజ్‌వేపై భారీ వాహనాల మినహా మిగిలిన వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ముంపునకు గురైన పంట పొలాలను గుర్తించి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, మరమ్మత్తులకు నోచుకోని డ్రైన్‌లను ఆధునికీకరించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

- ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో ముంపు
- వరి పొలాలన్నీ చెరువులుగా మారిన వైనం
- నాట్లు వేసిన పొలాల్లో మోకాలి లోతు నీళ్లు
- వేలాది ఎకరాల్లో పంట పొలాలు నీట మునక
- వరద భయంతో వణుకుతున్న లంక గ్రామాలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి):
అన్నదాతలకు ఆదిలోనే హంస పాదు ఎదురైంది. ఖరీఫ్ సేద్యానికి నడుం బిగించే సమయంలో జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాల కారణంగా రైతులు తీవ్ర కష్టనష్టాలను ఎదుర్కొవడం ప్రారంభమైంది. వేసిన నారుమడులు నీట మునిగాయి. కొన్నిచోట్ల నాట్లు వేసిన పొలాల్లో మోకాలు లోతు నీరు కెరాటాలు కొడుతోంది. ఫలితంగా ఖరీఫ్ తొలినాళ్లలోనే అన్నదాతలు కష్టాలు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కోనసీమ జిల్లాలో వేలాది ఎకరాల్లో పంట పొలాలు జలదిగ్బంధానికి గురయ్యాయి. భారీ వర్షాలకు డ్రెయిన్లు, కాల్వలు పొంగి ప్రవహించడంతో సమీపంలోని పంట పొలాలన్నీ ముంపునకు గురయ్యాయి. జిల్లాలో 22 మండలాల పరిధిలో 422 ఎకరాల నర్సరీలు, 8888 ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయని వ్యవసాయశాఖ అధికారులు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు శనివారం నివేదించారు. జిల్లాలో నమోదైన వర్షపాతం సరాసరిన 28.9 మిల్లీమీటర్లు ఉండగా ఆత్రేయపురం మండలంలో 59.8 మిల్లీమీటర్ల వర్షపాతం అత్యధికంగా నమోదైంది. కాట్రేనికోన, ఉప్పలగుప్తంలో 14.4 మిల్లీమీటర్లు అత్యల్పంగా నమోదైనట్టు అధికారులు ప్రకటించారు. కాగా డ్రెయిన్లలో ముంపు నీరు దిగే మార్గాలు మూసుకుపోతుండడంతో పాటు ఎక్కడికక్కడే రైతులు, స్థానికులు డ్రెయిన్లు, కాల్వలను ఇష్టారాజ్యంగా ఆక్రమించడం వల్ల అవి కుచించుకుపోయాయి. ఫలితంగా వర్షాలు, వరదల సమయంలో ముంపు నీరు దిగే మార్గాలు పెద్దగా లేకపోవడంతో సమీపంలో ఉన్న పంట పొలాలకు, రొయ్యల చెరువులకు ముంపు తీవ్రత పెరిగిపోవడం వల్ల ఆరుగాలం శ్రమించే అన్నదాతలకు అనూహ్య నష్టాలు ఎదురవుతున్నాయి.

పెరుగుతున్న వరద..

కోనసీమ జిల్లా పరిధిలోని వశిష్ఠ, వైనతేయ, గౌతమి, వృద్ధగౌతమీ నదీపాయల వెంబడి గోదావరి వరద వేగంగా పెరుగుతోంది. దీనికి తోడు గత కొన్ని రోజుల నుంచి వర్షపాతం భారీగా నమోదు అవుతుండడంతో వరద తీవ్రత పెరిగి కోనసీమ నదీ పరివాహక గ్రామాల ప్రజలను భయపెడుతోంది. ప్రస్తుతం భద్రాచలం వద్ద శనివారం రాత్రికి 43 అడుగులకు వరద ప్రవాహం చేరింది. సుమారు 8 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి వరద చేరుతుంది. 11.75 అడుగులకు నీటిమట్టం చేరే అవకాశం ఉండడంతో 10 లక్షల క్యూసెక్కుల నీటిని రాగల 48 గంటల్లో సముద్రంలోకి వదిలే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. గోదావరి వరద పెరుగుతున్నందున జిల్లా వ్యాప్తంగా ఉన్న పదమూడు రేవులు వద్ద అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ మహేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. లైఫ్ జాకెట్ల సహాయంతోనే బోట్లు నడపాల్సి ఉంటుందని అధికారులు సూచించారు. కాగా కాట్రేనికోన మండలం కుండలేశ్వరం వద్ద గట్టు కుంగుతున్న పరిస్థితులను కలెక్టర్ పరిశీలించారు. తక్షణమే గ్రావెల్‌తో అక్కడ రక్షణ చర్యలు చేపట్టాల్సిందిగా హెడ్‌వర్క్స్, ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గోదావరి వరదలు పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

పెరుగుతున్న గోదావరి

సాగుతున్న పడవ ప్రయాణం



పి.గన్నవరం, జూలై 20: గోదావరి నది పరివాహకంలో ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాలకు దిగువున నదీ పాయలు పొంగి ప్రవహిస్తున్నాయి. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మిగులు జలాలను సముద్రంలోకి వదులుతున్నారు. ఈ నేపథ్యంలో గౌతమి, వృద్ధ గౌతమి, వశిష్ఠ, వైనతేయ గోదావరి నదీ పాయలు వరద నీటితో నిండుగా ప్రవహిస్తున్నాయి. ఒక పక్క వరద మరో పక్క భారీ వర్షాలతో లంక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలలో ఇప్పటికే జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారులను నియమించి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. గోదావరి ఉధృతి మరింత పెరిగితే లంక గ్రామాలలో ఉద్యానవన, వాణిజ్య పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. గంటిపెదపూడి శివారు బూరుగులంక, పెదపూడిలంక, అరిగెలవారిపేట, ఉడిమూడి శివారు ఉడిమూడిలంక గ్రామస్థులు ఇంజిన్ పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. వరుణుడు కరుణించకపోవడంతో పడవపై రాకపోకలు సాగించడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. లంక గ్రామాల్లో కూరగాయల తోటలకు సైతం వరద ముప్పు పొంచి ఉండటంతో రైతులు హైరానా పడుతున్నారు. ముఖ్యంగా మునగ, బెండ, పచ్చిమిర్చి, బీర, ఆనబ, వంగ తదితర పంటలు ఎక్కువగా రైతులు పండిస్తున్నారు. వరద పెరగడంతో లోతట్టు ప్రాంతంలో ఉన్న కూరగాయలను రైతులు ఒబ్బిడి చేసుకునే పనిలో పడ్డారు. కాగా గోదావరి వరద ఉధృతిని బట్టి ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు వచ్చే అవకాశం ఉందని వారికి సమీప గ్రామంలో ఏర్పాట్లు కూడా చేస్తున్నామని ఆర్డీవో జి.వి.వి సత్యనారాయణ చెప్పారు.

జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలి

- వరద సహాయ చర్యల్లో సమర్థవంతంగా పనిచేయాలి
- అధికారులకు సూచించిన కలెక్టర్ మహేష్‌కుమార్
- వరద పరిస్థితిపై వీడియో కాన్ఫరెన్సు



కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): గత వరదల సమయాల్లో ఉన్న అనుభవాలు దృష్టిలో ఉంచుకుని ఈసారి వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులతో కలిసి మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి వరద సన్నద్ధతపై సమీక్షించారు. రాగల రెండు రోజుల్లో వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున ప్రతీ అధికారి అప్రమత్తతతో ఉండాలని సూచించారు. పి.గన్నవరం మండలంలో జి.పెదపూడి వద్ద తాత్కాలిక రహదారి నీటిలో మునిగిపోవడంతో నాలుగు గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయని, వారికి మర పడవలు ఏర్పాటుచేసి లైఫ్ జాకెట్ల సాయంతో రాకపోకలు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీలో నీరు నిల్వ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంటకాల్వలు, డ్రెయిన్లలో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క తొలగించడానికి టెండర్లు పిలిచామని, వ్యవసాయ, డ్రెయిన్స్ అధికారుల సమన్వయంతో ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వరదల సమయంలో ఏయే గ్రామాలకు ఎంత తాగునీరు అవసరం, అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మంచినీరు లేని ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లను గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నంబరు 9490610101ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులు ఆయా ప్రాంతాల్లో బలహీన వంతెనలు, కల్వర్టులు ఉంటే జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చి చర్యలు చేపట్టాలని, కాజ్‌వేల వద్ద బోర్డర్లు కనిపించేలా కర్రలు పెట్టాలని ఆదేశించారు. గర్భిణీలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వైద్య సిబ్బందికి సూచించారు. మండల స్థాయి ప్రత్యేక అధికారులు, ఇతర అధికారులను సమన్వయం చేసుకుని సమర్థవంతంగా పనిచేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి బోసుబాబు, డీపీవో రాంబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కుంగుతున్న ఏటిగట్లు

- పరిశీలించిన కలెక్టర్ మహేష్‌కుమార్
- తక్షణం గ్రావెల్‌తో మరమ్మతులు చేపట్టాలని ఆదేశాలు



గట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)
గోదావరి వరద పెరుగుతుండడంతో కోనసీమ నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న ఏటిగట్లు భయపెడుతున్నాయి. వృద్ధగౌతమీ నదీపాయను ఆనుకుని కాట్రేనికోన మండలం కుండలేశ్వరం పంటకాల్వ వైపు ఉన్న ఏటిగట్టు భారీగా కుంగుతోంది. దీంతో స్థానిక గ్రామాల ప్రజలు భయం గుప్పిట్లో ఉన్నారు. శనివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ తక్షణమే ఏటిగట్టు రక్షణకు చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ హెడ్‌వర్క్స్ అధికారులను ఆదేశించారు. వృద్ధ గౌతమి గోదావరి ఏటిగట్టు కుండలేశ్వరం వద్ద కుంగింది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు వృద్ధ గౌతమి గోదావరి కుడి ఏటిగట్టు కుండలేశ్వరం వద్ద 70.600-70.800 వరకు సుమారు 200 మీటర్ల మేర కాల్వలోకి కుంగిపోయింది. ఈ ప్రాంతాన్ని కలెక్టర్ మహేష్‌కుమార్ జలవనరుల శాఖ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. కుంగిన ఏటిగట్టుకు గ్రావెల్‌తో రక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. మురమళ్ల నుంచి పల్లంకుర్రు వరకు ఈ మార్గం దగ్గర కావడంతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, ట్రాఫిక్ రద్దీ ఎక్కువ కావడం వల్ల కుండలేశ్వరం వద్ద ఏటిగట్టు కుంగిపోయిందన్నారు. గట్టు కుంగిన చోట జలవనరుల శాఖ అధికారులు రక్షణ చర్యలు చేపడతారన్నారు. శాశ్వత ప్రాతిపదికన గట్టు రక్షణకు, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఉన్న కాల్వ గట్లు, రోడ్ల రక్షణ దృష్ట్యా భారీ వాహనాలు ఆ మార్గంలో తిరగకుండా గడ్డర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కాగా కుండలేశ్వరం వద్ద గట్టు భారీగా కుంగుతుండడంతో గ్రావెల్‌తో పూడ్చడంతో పాటు శాశ్వత ప్రాతిపదికన రిటర్నింగ్ వాల్ నిర్మించడం లేదా రివిట్‌మెంట్ చేయడం వంటి పనులు తక్షణమే ప్రారంభించాలని కాట్రేనికోన మండల రైతులు, ప్రజలు కోరుతున్నారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట హెడ్‌వర్క్స్ డివిజనల్ ఇంజనీర్ కేవీవీ సుబ్బారావు, జూనియర్ ఇంజనీర్ మన్యం ఈశ్వర్ ఉన్నారు.

యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయం

- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్
- రామచంద్రపురంలో మెగా జాబ్‌మేళా




మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 20: ప్రతీ నిరుద్యోగికి ఉద్యోగ, ఉపాధి కల్పనే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చెప్పారు. రామచంద్రపురం వీఎస్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో వికాస ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను మంత్రి సుభాష్, జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో చదువుకున్న ప్రతిఒక్కరికి ఉద్యోగం కల్పించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. రానున్న అయిదేళ్లలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ నిరుద్యోగ సమస్య పరిష్కారానికి నైపుణ్యాభివృద్ధి పెంచేందుకు ప్రభుత్వం ఇంటర్న్ షిప్ కార్యక్రమం వివిధ స్థాయిలలో ప్రవేశపెట్టిందన్నారు. మెగా జాబ్ మేళాకు జిల్లా వ్యాప్తంగా 3240 మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకోగా సుమారు 36 కంపెనీల హెచ్‌ఆర్‌లు హాజరయ్యారు. 603 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు, జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్, ఆర్డీవో ఎస్.సుధాసాగర్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

24న జాబ్‌మేళా

అమలాపురం టౌన్, జూలై 20: ప్రముఖ ప్రైవేటు కంపెనీల్లో పని చేసేందుకు ఈ నెల 24న అమలాపురంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి య. వసంతలక్ష్మి తెలిపారు. ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంకులో రిటైల్ బ్యాంకు మిత్రగా పనిచేసేందుకు 200 మందికి అవకాశాలు కల్పిస్తారన్నారు. కోనసీమ, కాకినాడ పరిధిలో పనిచేయాల్సి ఉంటుందని, రూ.14 వేలు పైబడి వేతనం చెల్లిస్తారని చెప్పారు. ఐఐఎఫ్ఎల్ సంస్థలో వంద కస్టమర్ రిలేషన్ షిప్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా పని చేయాల్సి ఉంటుందని, రూ.14,500 పైబడి వేతనం చెల్లిస్తారు. ఫ్యూచర్ ప్రాపర్టీ గ్రూపులో 120 మార్కెటింగ్ మేనేజర్, టెలీకాలర్స్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. రూ.10 వేలు నుంచి రూ.15వేలు వరకు వేతనం అందిస్తారు. క్రెడ్ రైట్ ఫైనాన్స్‌లో వంద సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయి. సత్య మైక్రో క్యాపిటల్ లిమిటెడ్‌లో వంద అప్రెంటీస్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని రూ.12,500తో పాటు ఇతర సదుపాయాలు కల్పిస్తారని తెలిపారు. 24వ తేదీ ఉదయం 10.30 గంటలకు జాబ్ మేళాకు సంబంధిత సర్టిఫికెట్లతో హాజరు కావాలని, మరిన్ని వివరాలకు సెల్ 8121838392ను సంప్రదించాలన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన అభ్యర్థులు అర్హులు.

శనేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట, జూలై 20: మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువ జాము నుంచే స్వామివారి సర్వదర్శనములకు, తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి ఒక్కరోజు రూ.1,15,223 ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.

జేసీగా నిశాంతి



(అమలాపురం-ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా టి.నిశాంతిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీసీఎల్‌ఏ జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్న ఆమెను కోనసీమకు బదిలీ చేశారు. 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన నిశాంతి ఒకట్రెండు రోజుల్లో పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటివరకు ఇక్కడ జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన శ్రీనివాస్ నుపుర్ అజయ్‌ను సీసీఎల్‌ఏ జాయింట్ సెక్రటరీగా బదిలీ చేశారు.

జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం



ముంపు నివారణ, రహదారుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలి

- నిధుల విడుదల కోసం పవన్ కల్యాణ్‌ను కోరదాం..
- సాదాసీదాగా జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

7లో

భక్తులతో కిటకిటలాడిన వాడపల్లి 7లో

వెంకన్న ఆలయంలో భక్తజనం

● స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.22.64 లక్షలు



ఆత్రేయపురం, జూలై 20: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల ఫలపుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుండి తరలి వచ్చిన భక్తులు చిరుజల్లులో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని స్వామివారిని గోవిందనామస్మరణతో స్వామివారిని దర్శించున్నారు. వివిధసేవలద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.22.64లక్షలు లభించినట్టు ఉపకమీషనరు కిషోర్‌కుమార్ తెలిపారు.

శృంగారవల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



పెద్దాపురం, జూలై 20: తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టిక్కెట్లవిక్రయం ద్వారా 1,07,020 అన్నదాన విరాళాలు రూ. 27,886 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.3,440 తులాభారం రూ.150, లడ్డూ ప్రసాదం ద్వారా 10,800, వెరసి రూ. 1.49,296 ఆదాయం సమకూరినట్లు ఈవో వడ్డి శ్రీనివాస రావు తెలిపాయి.. సుమారు 10వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు.

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు దరఖాస్తులు చేసుకోండి

అమలాపురంటౌన్, జూలై 20: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అగ్నివీర్ వాయు పథకంలో భాగమైన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాలకు ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా ఉపాధి అధికారి బి యు.వసంతలక్ష్మి తెలిపారు. ఎయిర్‌ఫోర్స్‌లో చేరేందుకు ఈనెల 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందన్నారు. అర్హత కలిగిన అవివాహితులైన స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులు. అభ్యర్థుల వయోపరిమితి 21 ఏళ్లలోపు ఉండాలి. 2004 జూలై 3 నుంచి 2008 జనవరి 3 మధ్యలో జన్మించిన అభ్యర్థులు అర్హులు. గణితం, ఫిజిక్స్, ఇంగ్లీషు సబ్జెక్టులో 50 శాతం మార్కుల ఉత్తీర్ణతతో ఇంటర్మీడియట్, ఇంజనీరింగ్, డిప్లొమో, తత్సమానమైన విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ మూడు విభాగాలుగా ఉంటుందని, ఆన్‌లైన్‌లో రాత పరీక్ష, ఫిజికల్, మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షలతో పాటు అర్హత ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందన్నారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ.550 చెల్లించాల్సి ఉంటుంది.

పాదగయలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు

పిఠాపురం, జూలై 20: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి సాంబశివరావునాయుడు సందర్శించారు. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను సతీసమేతంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేదపండితులు క్షేత్రప్రాశస్త్యం వివరించి ఆశీర్వచనాలు పలికారు. అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతంపలికి శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

పంటకాల్వలోకి దూసుకెళ్లిన కాలేజీ బస్సు

● విద్యార్థులు సురక్షితం



ఉప్పలగుప్తం, జూలై 20: ఓడ లరేవు నుంచి కూనవరం విద్యార్థులతో వస్తున్న ఓ కళాశాల బస్సు శనివారం సాయంత్రం సరిపల్లి వద్ద పంటకాల్వలోకి బోల్తా కొట్టింది. ఓడలరేవు నుంచి సరిపల్లి మీదుగా కూనవరం వస్తున్న సమయంలో స్టీరింగ్ ఫెయిలవ్వడంతో ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు. ప్రమాద సమయంలో బస్సులో ఆరుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. స్వల్ప గాయాలతో విద్యార్థులు బయపడ్డారు.

రంపచోడవరం ఐటీడీఏ పీవోగా సింహాచలం



రంపచోడవరం, జూలై20 : రంపచోడవరం ఐటీడీఏ పీవోగా కట్టా సింహాచలంను నియమించారు. ఈయన ఏపీ సీఆర్‌డీఏలో పనిచేస్తున్నారు. బదిలీపై రంపచోడవరం ఐటీడీఏ పీవోగా వస్తున్నారు. 2020 బ్యాచ్‌కు చెందిన సింహాచలం గతంలో రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. ఇప్పటివరకు ఇక్కడ పీవోగా పని చేసిన సూరజ్‌గనోరియా గుంటూరు బదిలీ అయ్యారు.

గోదావరి పరవళ్లు



● 4.09లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
● చింతూరు వద్ద 35 అడుగుల శబరి నీటిమట్టం
● గ్రామాలను చుట్టుముట్టిన వరద
● కొట్టుకుపోయిన రహదారులు
● స్థంభించిన రాకపోకలు

ధవళేశ్వరం, జూలై 20: ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల ఉపనదులతో పాటు వాగులు, వంకలు ఉప్పొంగి గోదావరిలో కలుస్తుండడంతో సీజన్‌లో మొదటిసారిగా గోదావరి వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది. ఎగువ నుంచి వస్తున్న వరదనీటితో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం పెరుగుతోంది. దీంతో శనివారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం, విజ్జేశ్వరం ఆర్మ్‌లలోని మొత్తం గేట్లను 1.5మీటర్లు, ర్యాలీ, మద్దూరు ఆర్మ్‌లోని మొత్తం గేట్లను 2మీటర్ల మేర పైకి ఎత్తి 4,09,459 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 8.70అడుగులుగా నమోదైంది.. ఎగువన ఉపనది ఇంద్రావతి, దిగువున శబరి నుంచి వరదనీరు గోదావరికి చేరుతుండడంతో ధవళేశ్వరం వద్ద సోమవారం నాటికి వరద ప్రవాహం మరింత పెరిగి 9లక్షల క్యూసెక్కులకుపైగా వరద నీరు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద క్రమంగా పెరుగుతున్న నీటి మట్టం శనివారం సాయంత్రానికి 35.20అడుగులకు చేరుకుంది. నీటిమట్టం మరింత పెరగవచ్చని అంచనా.

చింతూరులో అత్యధిక వర్షపాతం

చింతూరు, జూలై 20: చింతూరు డివిజన్ తడిసి ముద్దైంది. ఎటుచూసినా వరద నీరే. శనివారం ఉదయానికి చింతూరులో 20.7 సెంటీ మీటర్లు, కూనవరం 6. 6, ఎటపాక 6.8, వరరామచంద్రపురం మండలంలో 8.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ క్రమంలో శనివారం సాయంత్రానికి చింతూరువద్ద శబరి నీటిమట్టం 35 అడుగులకు చేరుకుంది. చింతూరు మండలంలోని సోకిలేరు, చంద్రవంక, చీకటివాగు, కుయుగూరు, అత్తాకోడళ్ళ వాగు, తడిక వాగులు వరరామచంద్రపురం మండలంలో అన్నవరం వాగు ఉధృతిగా ప్రవహిస్తున్నాయి. కూనవరం మండలంలో కోండ్రాజుపేట, టేకులబోరు గ్రామాల వద్ద రహదారులపై వరద నీరు చేరింది. ఎటపాక మండలం, తోటపల్లి, నెల్లిపాక, నందిగాం గ్రామాల వద్ద వాగులు గోదావరి ఎగపోటుతో నిండుగా ప్రహిస్తున్నాయి. కూనవరం మండల కేంద్రానికి చెందిన పలు కుటుంబాలు, వరరామచంద్రపురం మండలంలోని ఒడ్డుగూడెం, ఒడ్డుగూడెం కాలనీకి చెందిన పలు కుటుంబాలు వారి సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వరరామచంద్రపురం మండలంలో ముంపు ప్రాంతాలకు చెందిన బాధితులకు రేషను సరఫరా చేశారు. ఇక వర్షం ధాటికి చింతూరు మీదుగా ఒడిస్సాకు వెళ్ళే 326 నెంబరు జాతీయ రహదారి కుయుగూరు వద్ద కొట్టుకపోయింది. అదే దశలో చింతూరు కుయుగూరుల నడుమ వాగు వంతెనతో పాటు చింతూరు వరరామచంద్రపురం చింతూరు మండలాల నడుమ పలు వాగుల వంతెనలపై కూడా వదర నీరు ప్రవహిస్తుండడంతో ఆ దిశగా రాకపోకలు పూర్తిగా నిలచిపోయాయి. వాగుల వెంబడి ఎటువంటి ప్రయాణాలను అధికారులు అనుమతించడంలేదు. ఆ మేరకు వాగుల వెంబడి సిబ్బందిని కాపలాగా ఉంచారు. వరరామచంద్రపురం మండలంలోని అన్నవరం వాగు చప్టా కొట్టుకపోవడంతో అధికార యంత్రాంగం మరమ్మత్తులు పనులు చేపట్టి రాకపోకలు పునరావృతమయ్యే దిశగా చర్యలు చేపట్టింది. ముంపు గ్రామాలలో 227 మంది గిర్భిణి మహిళలు ఉన్నట్లు వైద్యశాఖ గుర్తించింది. ఆ మేరకు ఆయా ముంపును అనుసరించి గర్భిణి మహిళలను చింతూరు, కూనవరం ఆసుపత్రులకు నాటుపడవలు, ఆటోల ద్వారా తరలిస్తున్నారు. వారందరికి ఆసుపత్రులలో భోజన వసతి సమకూర్చుతున్నారు. ఇప్పటి వరకు చింతూరు ఏరియా ఆసుపత్రికి సాయంత్రం ఏడు గంటల వరకు 36 మంది, కూనవరం ఆసుపత్రికి 15 మంది గర్భిణి మహిళలను తరలించినట్లు డిప్యూటి డిఎంహెచ్‌ఓ పుల్లయ్య తెలిపారు.రాజమండ్రి, పాడేరు ఘాట్లపై ప్రయాణం కేవలం ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం ఏడు గంటల వరకు మాత్రమే నని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాలు జారి చేశారు. వర్ష ధాటికి కొండ చెరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున ఈ మేరకు కలెక్టర్ నిర్ణయం తీసుకోవడం జరిగింది.



చింతూరు-వరరామచంద్రపురం మండలాల నడుమ నీట మునిగిన ప్రధాన రహదారి

సీలేరుకు జలకళ

మోతుగూడెం, జూలై 20: సీలేరు నది పరివాహక ప్రాంతంలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు సీలేరు కాంప్లెక్సు పరిధిలోని జలాశయాల్లోకి నీరు చేసి జలకళతో కళకళలాడుతున్నాయి. ఎగువున ఉన్న కొండ ప్రాంతాల నుంచి వర్షపునీరు జలాశయాల్లోకి ఉరకలేస్తూ వచ్చి చేరుతుండటంతో నీటి నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. సీలేరు కాంప్లెక్సులోని జల విద్యుత్ కేంద్రాలకు నీటి సమస్య తప్పిందని జెన్‌కో అధికార్లు భావిస్తున్నారు. సీలేరు నది పరివాహక ప్రాంతంలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు సీలేరు కాంప్లెక్సు ప్రధానమైన జలాశయం అయిన బలిమెల జోలాపుట్‌లో 6.1649 టీఎంసీలు నీటినిల్వలు వచ్చి చేరాయని, అలాగే డొంకరాయి, గుంటవాడ జలాశయాల్లో 3టీఎంసీల వరకు నీటి నిల్వలు వచ్చి చేరాయని జెన్‌కో అధికార్లు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జోలాపుట్‌కు 4728 క్యూసెక్కులు, బలిమెలకు 31459 క్యూసెక్కులు, గుంటవాడకు 3480 క్యూసెక్కులు, డొంకరాయికి 3591 క్యూసెక్కులు, ఫోర్‌బైకు 2853క్యూసెక్కుల ఇన్‌ఫ్లోస్ వచ్చి చేరుతున్నాయి. డొంకరాయి ఏపీపీ డ్యాం కూడా వరదనీరు ఉధృతంగా వచ్చి చేరుతుంది. శనివారం ఏపీపీ డ్యాంకు 4వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోస్ వచ్చి చేరడంతో ఇక్కడ నీటి మట్టం పూర్తిస్థాయికి చేరింది. ఏపీపీ డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 940అడుగులు కాగా శనివారం ఉదయానికి అది పూర్తిస్థాయికి చేరుకోవడంతో జెన్‌కో అధికార్లు అప్రమత్తమై రెండు గేట్లు ఎత్తి 10000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



నీట మునిగిన గండిపోశమ్మ ఆలయం

గండిపోశమ్మ ఆలయాన్ని ముంచిన వరద

● ముంపు గ్రామమైన తాళ్ళూరులో చిక్కిన 22 కుటుంబాలు

దేవీపట్నం, జూలై20: గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలో గోదావరి వరద పెరుగుతూ వచ్చింది. శనివారం నాటికి గండిపోశమ్మ అమ్మవారి ఆలయాన్ని గోపురం వరకు తాకింది. అదేవిధంగా మండలంలోని ఫజుల్లాబాద్, సీతపల్లి తదితర వాగులు పొంగిప్రవహిస్తున్నాయి. ముంపు గ్రామం తాళ్ళూరులోనే 22 కుటుంబాలు ఉండిపోవడంతో వారంతా వరదధాటికి కొండపైకి వెళ్లి తలదాచుకుంటున్నారు. అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవలసి ఉంది. వరద ఉధృతికి ఎక్కడికక్కడ ప్రజలను అధికారులు, పోలీసులు అప్రమత్తం చేస్తూ గోదావరి, వాగుల వద్దకు వెళ్లనీయకుండా చర్యలు తీసుకుంటున్నారు.

కోనసీమను ముంపు నుంచి.. గట్టెక్కించాలి



జడ్పీ స్థాయి సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు రామకృష్ణారెడ్డి, ఆనందరావు, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

● భారీ వర్షాల నేపథ్యంలో సహాయక చర్యలపై చర్చ
● గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలి
● నిధుల విడుదల కోసం పవన్ కల్యాణ్‌ను కోరదాం
● సాదాసీదాగా జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కాకినాడసిటీ, జూలై 20: గత కొన్ని రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలవల్ల అంటువ్యాధులు ప్రబలకుండా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా అన్ని ఆవాసాల్లో ప్రజారోగ్య పరిరక్షణ, పారిశుధ్య చర్యలను ముమ్మరంగా చేపట్టాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధికారులను కోరారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు శనివారం కాకినాడ జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగాయి. ఇందులోభాగంగా ఆర్థిక-ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, విద్య-వైద్యం, అభివృద్ధి పనులు తదితర అంశాలపై 1,2,4,7 స్థాయీ సంఘాల సమావేశాలు జడ్పీ ఛైర్మన్ వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగాయి. వ్యవసాయం అంశంపై 3వ స్థాయీ సంఘ సమావేశం వైస్‌ఛైర్మన్ బుర్రా అనుబాబు, సాంఘిక సంక్షేమం అంశంపై 6వ స్థాయీ సంఘ సమావేశం వైస్ ఛైర్‌పర్సన్ మేరుగు పద్మలత, స్త్రీ శిశు సంక్షేమం అంశంపై 5వ స్థాయి సంఘ సమావేశం జడ్పీటీసీ రొంగల పద్మావతి అధ్యక్షతన జరిగాయి. సమావేశాలలో జడ్పీ ఛైర్మన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ ఇటీవల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా భారీగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజారోగ్యం, పారిశుధ్యం, ముంపు నివారణ, రహదార్ల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని నాలుగు ఉమ్మడి జిల్లాల అధికారులను కోరారు. తాగునీటి వనరుల క్లీనింగ్, క్లోరినేషన్, నీటి నమూనాల టెస్టింగ్, పైపులైన్లలోకి డ్రైనేజీ కలుషిత నీరు కలువకుండా నివారణ పనులను అన్ని ఆవాసాల్లో చేపట్టాలని పలువురు జడ్పీటీసీ సభ్యులు అధికారులను కోరారు. ఇటీవల బెండపూడి, యు కొత్తపల్లి, ఏవీనగరం గ్రామాల్లో డయేరియా ప్రబలిన నేపథ్యంలో మరింత అప్రమత్తత అవసరమని సూచించారు.

వరద, ముంపు సమస్యలపై ఎమ్మెల్యేల గళం..

గోదావరి వరద వల్ల పంట భూములు ముంపునకు గురికాకుండా నివారించేందుకు కాలువలు, డ్రెయిన్లలో గుర్రపు డెక్క తొలగింపును వెంటనే చేపట్టాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అన్ని కనీస సదుపాయాలు అందేలా చూడాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ కోరారు. భారీ వర్షాలు కురుస్తున్న పరిస్థితుల్లో కోనసీమలో వరద, ముంపు సమస్యలను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రస్తావించారు. రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపు జాప్యం జరుగుతోందని, చెల్లింపులు వేగవంతం చేసి రైతులు ఇబ్బందులకు గురికాకుండా చూడాలని 3వ స్థాయీ సంఘ సమావేశంలో సభ్యులు కోరారు. రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. జిల్లాలో అసంపూర్తిగా మిగిలిపోయిన అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను పూర్తిచేసి వినియో గంలోకి తేవాలని 5వ స్థాయీ సంఘ సమావేశంలో సభ్యులు కోరారు. నిధుల కొరత వల్ల ఆర్థిక, ప్రణాళిక, పనులు ముందుకు సాగడం లేదని, చేసిన పనులకు బిల్లుల చెల్లింపులు కూడా జరగలేదని 6వ స్థాయీ సంఘ సమావేశంలో సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

20 నెలలుగా జడ్పీటీసీలకు గౌరవ వేతనాల చెల్లింపులు లేవు..

గడచిన 20 నెలలుగా జడ్పీటీసీ సభ్యులకు గౌరవ వేతనం చెల్లింపులు కూడా జరగలేదని పలువురు జడ్పీటీసీ సభ్యులు ఛైర్మన్ దృష్టికి తెచ్చారు. జడ్పీకి రావలసిన గ్రాంట్‌ల సత్వర విడుదల కోసం ప్రభుత్వాన్ని కోరి, నిధులు రాగానే అన్ని చెల్లింపులు చేస్తామని ఛైర్మన్ వేణుగోపాలరావు తెలిపారు. జిల్లా నుంచే శాసనసభలో ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయనున్నట్లు ప్రకటించినందున ఈ నిధుల విడుదల కోసం జడ్పీ ద్వారా కోరదామని వైస్‌ఛైర్మన్‌లు బుర్రా అనుబాబు, మేరుగు పద్మలత తెలిపారు. సమావేశాల్లో వివిధ ప్రజా ప్రాధాన్యతాంశాలపై సమగ్రమైన చర్చ జరగడం పట్ల జడ్పీ ఛైర్మన్ వేణుగోపాలరావు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈవో రామగోపాల్, ఉమ్మడి జిల్లా జడ్పీటీసీలు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పాడేరు జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

● ఏఐకేఎంఎస్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 20 : దేశానికి అన్నం పెడుతున్న రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి అశోక్ ఘోయాల్ కోరారు. రాజమహేంద్రవరం మావో భవన్‌లో శనివారం జరిగిన అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లా డారు. కేంద్ర ప్రభుత్వం 2024-25 మార్కెటింగ్ సీజన్‌లో వరికి కనీస మద్దతు ధరను కేవలం రూ.117లు మాత్రమే పెంచడం దుర్మార్గమని అన్నారు. ప్రధాని మోదీ సర్కార్ అనుసరిస్తున్న రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలన్నారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకురాలు పి.టాన్యా మాట్లాడుతూ కేంద్రంలో మోదీ సర్కార్, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం బడ్జెట్లలో వ్యవసాయరంగానికి అధిక నిదులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏఐకేఎంఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.భాస్కర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తుల కబంధహస్తాల నుంచి కాపాడుకోవాలన్నారు. సభ అనంతరం మావో భవన్ నుంచి గోకవరం బస్టాండు వరకూ రైతు కూలీలు ప్రదర్శన చేశారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.ప్రకాష్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమాక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు, వి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమికి పిఠాపురం ముస్తాబు

● దత్తక్షేత్రం, సాయిబాబా ఆలయాల్లో ఏర్పాట్లు



పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం

పిఠాపురం జూలై 20: దత్తాత్రేయుడు స్వయంభూ వెలసిన క్షేత్రం, శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానమైన పిఠాపురం పట్టణం గురుపౌర్ణమి వేడుకలకు సిద్ధమైంది. పట్టణంలోని దత్తక్షేత్రాలు, సాయిబాబా ఆలయాల్లో ఈ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఆయా ఆలయకమిటీలు, దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నాయి. దత్త క్షేత్రాల్లో వేడుకలకు ఉభయ తెలుగురాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్నాటక, ఒరిస్సా తదితర రాష్ట్రాలు నుంచి భక్తులు అధికంగా తరలివస్తారు. ఇప్పటికే ఆయా ఆలయాల వసతిసముదాయాలు, ప్రవేటు వసతి గృహాలు, లాడ్జిలు మహారాష్ట్ర, కర్నాటక భక్తులతో కిటకిటలాడుతున్నాయి. పట్టణంలోని బైపాస్‌రోడ్డులో గల గోపాల్‌బాబా ఆశ్రమం. అగ్రహారంలోని అనఘాదత్త క్షేత్రం, సినిమాసెంటర్ లోని షిర్డీ సాయినాథ్ మందిరంలో, మెయిన్‌రోడ్డులో గల సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు కార్యక్రమాలు జరగనున్నాయి. పట్టణ శివారులోని విశ్వవిజ్ఞానవిద్యా ఆద్యాత్మిక పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో గురుపౌర్ణమి సభ జరగనున్నది. పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేస్తారు. సాయిబాబా, దత్త ఆలయాలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

సౌదీ ఎడారిలో మరో తెలుగోడు

● రక్షించాలంటూ ఇసుకపూడివాసి వీడియో వైరల్
● స్పందించిన లోకేశ్.. రెండ్రోజుల్లో ఇంటికి చేరుస్తామని భరోసా



సౌదీ ఎడారిలో చిక్కుకున్న వీరేంద్రకుమార్

అంబాజీపేట, జూలై 20: ఉమ్మడి చిత్తూరు జిల్లా వాయ ల్పాడు మండలానికి చెందిన శివ ఏడాది దేశంలో చిక్కుకుని నరకయాతన అనుభవించి.. ఎట్టకేలకు మంత్రి లోకేశ్ చొరవతో తిరిగి స్వదేశానికి వచ్చిన విషయం తెలిసిందే. ఈ సంఘటన మరువక ముందే మరో తెలుగోడు సౌదీ ఎడాదిలో చిక్కుకుని అష్టకష్టాలు పడుతున్న వైనం వెలుగులోకి వచ్చింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇసుకపూడి మెరకపేటకు చెందిన సరెళ్ల వీరేంద్రకుమార్ బతుకుదెరువు కోసం సౌదీకి వెళ్లి.. ఏజెంట్ మోసంతో అక్కడి ఎడారిలో చిక్కుకుని నరకయాతన పడుతున్నాడు. వీరేంద్ర వంటమనిషిగా పనిచేసేందుకు ఈ నెల 9న మధ్యవర్తులు, ఏజెంటు ద్వారా ఖత్తర్ దేశానికి వెళ్లాడు. 10న ఖత్తర్‌లో దిగిన అతడిని అక్కడి నుంచి సౌదీ అరేబియాకు పంపించారు. తీరా ఇంటిలో పనులు, వంట పనులు కాకుండా.. వీరేంద్రకుమార్‌ను ఎడారిలో ఒంటెల కాపరిగా నియమించారు. అక్కడ ఎండల తీవ్రత, అధిక ఉష్ణోగ్రతల కారణంగా వీరేంద్రకు రక్తపు వాంతులబారిన పడ్డాడు. ఆ ప్రాంతంలో తాగేందుకు నీరు, ఆహారం దొరక్క నరకయాతన పడుతున్నాడు. దీంతో అతడి ఆరోగ్యం క్షీణించింది. దీంతో నత దయనీయ స్థితిని వివరిస్తూ తల్లిదండ్రులు సరెళ్ల సత్తిరాజు, మరియమ్మ, తమ్ముడు రవీంద్రకు వీరేంద్ర వాట్సాప్‌ద్వారా వీడియో సందేశం పంపించాడు. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు విషయాన్ని స్థానిక సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్‌బాబూరావు, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్‌కు తెలిపారు. వారు ఈ నెల 19న అమరావతిలోని ఎన్ఆర్ టీఎస్ విభాగం (తెలుగు సొసైటీ) అధికారులకు వీరేంద్ర ఇబ్బందులను వివరిస్తూ ఫిర్యాదు చేశారు. అలాగే తల్లిదండ్రులు కుమారుడి వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్ అయింది. ఈ పోస్టుపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. రెండు రోజుల్లో స్వదేశానికి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని సోషల్ మీడియా వేదికగా ఆయన హామీ ఇచ్చారు. కాగా, తమను ఇబ్బందులు లేకుండా చూసుకుంటానని ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన తమకుమారుడు ఇప్పుడు చావుబతుకుల్లో ఉన్నాడంటూ వీరేంద్ర తల్లిదండ్రులు సరెళ్ల సత్తిరాజు, మరియమ్మ, తమ్ముడు రవీంద కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇల్లు కట్టి సెటిల్ అవుతానని, తమ్ముడ్ని ఉన్నత చదువులు చదివిస్తానని చెప్పాడంటూ కొడుకును తలచుకుని రోదిస్తున్నారు. వీరేంద్రకుమార్ కుటుంబ సభ్యులను నియోజకవర్గ టీడీపీ నాయకులు శనివారం పరామర్శించారు. వీరేంద్రను రెండు రోజుల్లో స్వదేశానికి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని మంత్రి లోకేశ్ మాటిచ్చారని, అధైర్యపడొద్దని వారికి ధైర్యం చెప్పారు.

ముగ్గురు మిలీషియా సభ్యుల అరెస్టు



విలేకరు సమావేశంలో మాట్లాడుతున్న చింతూరు ఎఎస్‌పి రాహుల్ మీనా

చింతూరు, జూలై 20: మావోయిస్టు పార్టీకి చెందిన ముగ్గురు మిలీషియా సభ్యులను శనివారం అరెస్టు చేసినట్లు చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా తెలిపారు. ఈ మేరకు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడిం చారు. ఏడుగురాళ్లపల్లి అటవీ ప్రాంతంలో మిలీషియా సభ్యులు సమావేశమైన సమాచారం అందుకున్న చింతూరు పోలీసులు, సీఆర్‌పీఎఫ్ జవాన్లు కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో మావోయిస్టు మిలీషియా సభ్యులుగా వ్యవహరిస్తున్న వంజం ఉంగయ్య, కుర్స రాజకుమార్, మడివి ఇరమయ్యలు పోలీసుల చేతికి చిక్కారన్నారు. వారిని అదుపులోకి తీసుకోవడంతోపాటు వారి నుంచి ఒక ప్రెషర్‌బాంబ్, 3 గ్రెనేడ్లు, రెండు ఎలక్ట్రికల్ డిటోనేటర్సు, ఐరన్ ముక్కలు, ఎలక్ట్రికల్ వైర్, బ్యాటరీ, మావోయిస్టులకు చెందిన కరపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ముగ్గురు మిలీషియా సభ్యులు కూడా ఎటపాక మండలానికి చెందినవారేనన్నారు. వీరిలో ఉంగయ్యది విస్సాపురం పంచాయతీ సంగంపాడుకాగా, 2022లో శబరి ఏరియా కమిటీ కమాండర్ గీత ఇతడిని గ్రామ కమిటీ సభ్యుడిగా నియమించిందన్నారు. కుర్స రాజకుమార్ ది కూడా సంగంపాడు గ్రామమే కాగా, మావోయిస్టు పార్టీ ఇతడిని సంగంపాడు గ్రామ మిలీషియా కమాండర్‌గా నియమించారన్నారు. మడవి ఇరమయ్య చుక్కలపాడు గ్రామం కాగా, మిలీషియా సభ్యుడిగా, గ్రామకమిటీ సభ్యుడిగా వ్యవహరిస్తున్నట్లు ఏఎస్పీ తెలిపారు. ఈముగ్గురు. 2024లో మల్లంపేటలో పోలీసులను హతమార్చేందుకుగాను అంబుష్ వేయడం, ఏడుగురాళ్లపల్లిలో తునికాకు గోదామును తగులబెట్టడం, ఏడుగురాళ్ళపల్లి సంతలో మావోయిస్టు పార్టీ కరపత్రాలను వేయడం లాంటి నేరాలలో పాల్గొన్నారు. ఈ మేరకు ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ గజేంద్రకుమార్, ఎస్ఐ శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

కళాశాల విద్యారంగ అభివృద్ధికి చర్యలు

● కళాశాల విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్

రాజమహేంద్రవరంఅర్బన్, జూలై 20 : రాష్ట్రంలో కళాశాల విద్యారంగ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నామని, ప్రధానంగా ఇంటిగ్రేటెడ్ స్కిల్ డెవలప్‌మెంట్‌పై అటానమస్ కళాశాలలు ప్రత్యేక దృష్టి పెట్టాలని కళాశాల విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో అటానమస్ కళాశాలల ప్రధానాచార్యులు, ఇతర ముఖ్య సిబ్బందికి మూడు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ ముగింపు సభలో శనివారం ఆయన మాట్లాడారు. అటానమస్ కళాశాలలతోపాటు ఇతర డిగ్రీ కళాశాలలు అభివృద్ధి పథంలో పయనించాలన్నారు. కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ చప్పిడి కృష్ణ, కమిషనరేట్ అధికారులు కె.విజయబాబు, అనిల్‌కుమార్, ఆర్‌జేడీలు,ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

రాయవరం,జూలై 20: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రాయవరం వీఎస్ఎం కల్యాణ మండపంలో జరిగిన విజ్ఞాన్ కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకుఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మాజీ జడ్పీటీసీ పడాల వెంకటరామారెడ్డి(రాము), విద్యాసంస్థల ఛైర్మన్ అమ్మిరెడ్డి, డైరెక్టర్స్ మల్లిడి శేషవేణి పాల్గొన్నారు.

● ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, బండారు సత్యానందరావు, దేవ వరప్రసాద్

మండల అభివృద్ధిపై కలిసి ముందుకు సాగాలి



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం, జూలై 20: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీవో కొండలరావు శాఖల వారీగా అభివృద్ధి పనులపై సమీక్ష జరిపారు. నాలుగేళ్లుగా గుర్రపుడెక్క, వ్యర్థాలు తొలగించకపోవడంతో పంటకాల్వలు, డ్రెయిన్లు మూసుకుపోయి పంట చేలల్లో నీరు దిగక రైతులు నష్టపోతున్నారని పలువురు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. రేషన్ పంపిణీలో వ్యత్యాసాలు వస్తున్నాయని ఎంపీటీసీ పలివెల మధు అన్నారు. గృహ నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులను ఇబ్బంది పెట్టవద్దని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కపిలేశ్వరపురం జగనన్న కాలనీలో నీరు నిలబడిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామసర్పంచ్ సాకా శ్రీనివాస్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కేదార్లంక లబ్ధిదారులకు కపిలేశ్వరపురంలో ఇళ్ల స్థలాలు కేటాయించారని, ఇది కోర్టు పరిధిలో ఉందని, గ్రామంలోనే స్థలాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ వీధివెంకటరెడ్డి ఎమ్మెల్యేను కోరారు. అద్దంకివారిలంకలో వరద ప్రాంతాలనుఆర్డీవో పరిశీలించి వెళ్లి పోయారని, తనకు విషయం తెలియజేయలేదని గ్రామసర్పంచ్ నాతి గవరయ్య ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులు ప్రొటోకాల్ పాటించాలని ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గానికి లోఓల్టేజీ సమస్య లేకుండా 78 ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం కాగా కపిలేశ్వరపురం మండలానికి 38 మంజూరయ్యాయని, ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు కోరుమిల్లిలో ఏర్పాటు చేసి లోఓల్టేజీ సమస్య పరిష్కరించామని ఎమ్మెల్యే తెలిపారు. మిగిలినవి కూడా త్వరలో ఏర్పాటుచేసి లోఓల్టేజి సమస్య పరిష్కరిస్తామన్నారు. విద్యుత్, డ్రెయిన్స్, అంటువ్యాధులు తదితర సమస్యలను పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశం దృష్టికి తీసుకురాగా పరిష్కరించాలంటూ ఆయా శాఖల అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావును మండలపరిషత్ కార్యాలయ ఉద్యోగులు, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎన్జీవో సంఘం నాయకులు పూలమాలలతో కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఎ.శాంతి, ఎంపీడీవో కొండలరావు, డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికార్లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తపో ఆశ్రమ అభివృద్ధికి కృషి చేస్తా : ఎంపీ హరీష్


బాలయోగీశ్వరులను దర్శించుకుంటున్న ఎంపీ హరీష్‌మాధుర్

ముమ్మిడివరం, జూలై 20: ముమ్మిడివరంలోని శ్రీభగవాన్ బాలయోగీశ్వరుల తపో ఆశ్రమ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు సహాయ సహకారాలు అందిస్తానని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. ముమ్మిడివరంలోని బాలయోగీశ్వరుల తపో ఆశ్రమాన్ని శనివారం ఆయన సందర్శించారు. భగవాన్ బాలయోగీశ్వరులు, చినబాలయోగీశ్వరుల సమాధుల వద్ద ప్రత్యేక పూజలు జరిపించారు. ఆశ్రమ ప్రాంతాన్ని ఆయన తిలకించి బాలయోగీశ్వరుల విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 22నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాల్లో కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణానికి పార్లమెంటులో చర్చించేందుకు ఇప్పటికే తాను స్పీకర్‌కు అవకాశం ఇవ్వాల్సిందిగా దరఖాస్తు చేసుకున్నట్టు పేర్కొన్నారు. ఈసందర్భంగా జక్కల ప్రసాద్ ఆధ్వర్యంలో తాళ్లరేవు మండలం నుంచి 30మంది మహిళలు ఎంపీ హరీష్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అయ్యాజీవేమా, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జగడం సత్యనారాయణ, టీడీపీ నాయకులు చెల్లి అశోక్, తాడి నరసింహారావు, దొమ్మేటి రమణకుమార్, దాట్ల బాబు, గొల్లపల్లి గోపి, చిక్కాల అంజిబాబు, మెండి కమల, యాళ్ల ఉదయ్, నడింపల్లి శ్రీనివాసరాజు, కొయ్యల దుర్గారావు, కాశి లాజర్, కటికిదల చంద్రరావు, కటికదల చినసుబ్బారావు, కటికదల బాలకృష్ణ, కటికదల బాలవివేకానంద్, యలమంచిలి బాలరాజు పాల్గొన్నారు.

ఎంపీపీ చాంబర్ నిర్మాణ వ్యయం లెక్కలు తేల్చండి

ఉప్పలగుప్తం, జూలై 20: ఎంపీపీ ఛాంబర్ ఆధునికీకరణకు నిబంధనలకు మించి చేసిన ఖర్చుపై వివరాలు, నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లకు నిధులు కేటాయింపుపై గణాంకాలు ఇవ్వాలని టీడీపీ ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి నిలదీశారు. అలాగే అత్యవసర సమయంలో ఇరిగేషన్, డ్రెయిన్స్ అధికారుల గైర్హాజరు తదితర అంశాలపై సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించడంతో మండల పరిషత్ సమావేశం వాడివేడిగా జరిగింది. శనివారం ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకీరాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో భీమనపల్లి ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి మాట్లాడుతూ గతంలో ఎంపీపీ చాంబర్‌కు నిబంధనలను అతిక్రమించి ఖర్చు చేశారని, ఈ అంశంపై ఎన్నిసార్లు వివరాలు అడిగినా వాయిదాల పద్ధతిలో తప్పించుకుంటున్నారని వ్యాఖ్యానించారు. నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లకు ఎంత కేటాయించారో లెక్కలు చెప్పాలని ఇంజనీరింగ్ అధికారిని నిలదీశారు. నిర్మాణాల వ్యయం వివరాలు తక్షణం ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. వారం రోజుల్లో ఇస్తామని ఎంపీడీవో కొరాటి వెంకటేశ్వరప్రసాద్ పాత పద్ధతిలోనే సర్దిచెప్పి అంశాన్ని దాటవేశారు. విద్యుత్ సమస్యలపై విలసవిల్లి ఎంపీటీసీ సలాది సురేఖావాణితో పాటు పలువురు సభ్యులు ప్రశ్నించారు. గొల్లవిల్లి, సన్నవిల్లి గ్రామాల పొలాలకు ముంపునీరు దిగే డ్రెయిన్ అంశం ఏశాఖదో తెలుసుకునేందుకు రెవెన్యూ, డ్రెయిన్స్ అధికారులు సమావేశానికి రాకపోవడంతో సన్నవిల్లి సర్పంచ్ చిక్కం జంగమయ్యతో పాటు పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రెయిన్స్ పూడుకుపోయి పొలాలు జలాశయాలుగా మారి రైతులు నానా ఇబ్బందులు పడుతుంటే అధికారుల్లో కనీస స్పందన కరువయ్యిందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. వేదికపై జడ్పీటీసీకి స్థానం కేటాయించకోవడంపై నంగవరం సర్పంచ్ ఎంపీడీవోను ప్రశ్నించారు. వేదికపై ఎంపీపీ, ఎంపీడీవో, ఇతర ముఖ్య అతిథులకు మినహా ప్రొటోకాల్ ప్రకారం ఇతరులకు అవకాశం ఉండదని ఎంపీడీవో బదులిచ్చారు. రూ.1.63కోట్లతో వాసాలతిప్పలో నాలుగు రహదారుల నిర్మాణానికి పర్యాటక అభివృద్ధిశాఖ ప్రతిపాదించిన తీర్మానాలను సమావేశంలో ఆమోదించారు.

కల్వర్ట్‌పై కూలిన స్లాబ్

యానాం, జూలై 20: యానాం గోపాల్‌నగర్ వద్ద గల గాంధీనగర్ మూడో వీధి రోడ్డు మధ్యలో ఉన్న కల్వర్ట్ స్లాబ్ కూలిపోయింది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సంఘటన ప్రాంతాన్ని పరిపాలనాధికారి మునిస్వామి, ఇతర అధికారులు పరిశీలించారు. కూలిన స్లాబ్‌ను క్రేన్ సహా యంతో తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

నవోదయ విద్యార్థి ఆకాష్ ప్రతిభ



యానాం, జూలై20: యానాం జవహర్ నవోదయ విద్యార్థి యు.ఆకాష్ ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఏరోస్పేస్ కోర్సులో ఎంపికైనట్లు యానాం నవోదయవిద్యాలయ వైఎస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. నవోదయకు, యానానికి పేరుతేవడంపట్ల ప్రిన్సిపాల్ సంతోషంవ్యక్తం చేశారు. విద్యార్థి తండ్రి నవోదయలో గణితఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

ఇంకా ముంపులోనే పంట పొలాలు







ఆలమూరు: పెనికేరులో వరినాట్లును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు, ఉప్పలగుప్తం: భీమనపల్లిలో నారుమళ్ళను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల బృందం, రాజోలు: రాజోలులో వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

ముమ్మిడివరం, జూలై 20: అల్ప పీడనం కారణంగా మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్తంభించింది. వరి పొలాలు వర్షపు నీటిలో మునిగాయి. వేసిన వరి నాట్లు, నారుమడులు కూడా నీట మునగడంతో వ్యవసాయ పనులు నిలిచిపోయాయి. పంటకాల్వలు, మురుగునీటి కాల్వలు వర్షం నీటితో పొంగి ప్రవహిస్తున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయి వరి పొలాలు ముంపులోనే మునిగి ఉన్నాయి. ముమ్మిడివరం మండలంలో శనివారం 15.6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జగనన్న కాలనీలు, పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. కాలనీల్లో అప్రకటిత రోడ్లు ఇంకా ముంపులోనే ఉన్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇలా ఉండగా గోదావరి ఎగువ ప్రాంతంలో వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో దిగువన గోదావరి పొంగి ప్రవహిస్తుంది. క్రమేపీ వరద నీటిమట్టం పెరుగుతుంది. లంక గ్రామాల ప్రజలను రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేశారు. నాటు పడవలపై రాకపోకలు సాగించరాదని, గోదావరిలో రాకపోకలు సాగించేవారు విధిగా లైఫ్ జాకెట్లు ధరించాలని తహసీల్దార్ బి.శ్రీనునాయక్ సూచించారు. పశువుల కోసం, లంకలోకి వెళ్లేవారి కోసం, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు అవసరమైన లైఫ్ జాకెట్లను సిద్ధం చేసినట్టు ఆయన తెలిపారు. వీఆర్వోలు స్థానికంగా ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ కొనసాగుతుంది.

ఆలమూరు: వర్షాలకు పంటలు ముంపునకు గురవడంతో రైతులను ఆదుకుంటామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చెప్పారు. నష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. పెనికేరు, గుమ్మిలేరు, మోదుకూరు, ఆలమూరు గ్రామాల్లో ముంపునకు గురైన వరినాట్లను ఎమ్మెల్యే బండారు పరిశీలించారు. నష్టాలను తక్షణం అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. నష్టాల గురించి రైతులతో కొద్దిసేపు మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సమస్యలను అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు వివరించనున్నట్లు బండారు చెప్పారు. బండారు వెంట అధికారులు, నాయకులు ఉన్నారు.

కొత్తపేట: అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు ముంపునకు గురైన పంట పొలాలను శనివారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలకరి సాగుకు ఏర్పడిన ఇబ్బందులను గుర్తించి ముంపును తొలగించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వైసీపీ ప్రభుత్వంలో నీటిపారుదల వ్యవస్థ పూర్తి నిర్లక్ష్యానికి గురైందని డ్రెయిన్లు, ముంపునీరు వెళ్లేందుకు లేదని వాటిన్నంటిని త్వరలో పరిష్కరించి రైతులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీను, రెడ్డి రామకృష్ణ, ఐరెడ్డి రామారావు, చిల్లే ప్రసాదరావు, విశ్వ వీరమారుతీప్రసాద్, రెడ్డి తాతాజీ, నల్లా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: వాయిగుండంతో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు ముంపు నీటిలో నారుమడులు నానుతున్నాయి. వర్షం నీటిని మళ్లించేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరి పొలాలను శనివారం ఏవో పరిశీలించారు. వర్షం నీరు బయటకు మళ్లించి కార్బండిజమ్, ఎగ్జాకోనజోల్ పిచికారి చేయాలన్నారు.

రాజోలు: రాజోలులో మేకలపాలెం పుష్కరాల రేవు వద్ద వశిష్ఠ గోదావరి వరద ఉధృతిని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శనివారం పరిశీలించారు. వరద ఉధృతిపై తహసీల్దార్ గోపాలకృష్ణకు ఆయన పలు సూచనలు చేశారు. ఆయన వెంట గ్రామశాఖ అధ్యక్షుడు అడబాల విజయ్, మండలం జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, ఉండవల్లి అంజి, పినిశెట్టి బుజ్జి, ఇల్లింగి వెంకటరమణ తదితరులు ఉన్నారు.

కె.గంగవరం: మండలంలో శనివారం తెల్లవారుజాము నుంచి ఈదురుగాలులు బలంగా వీచాయి. భారీ వర్షం కురిసింది. పంట పొలాలు నీట మునిగాయి. మురుగు డ్రైన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈదురుగాలులుకు పలు గ్రామాల్లో చెట్లు పడిపోయాయి. శివలలో ఇళ్ల రామకృష్ణ ఇంటిపై కొబ్బరి చెట్టు పడింది. పాక్షికంగా నష్టం వాటిల్లింది.

మలికిపురం: మండలంలో ముంపు నీటిలో మునిగిపోయిన వరి నారుమడులను శనివారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి బోసుబాబు పరిశీలించారు. దిండి, గుడిమెళ్లంక, లక్కవరం, మట్టపర్రు తదితర ప్రాంతాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. ఐదు రోజులు నీటిలో నానిపోయిన నారుమడులకు కిలో యూరియా, కిలో పొటాష్ ద్రావణాన్ని పిచికారీ చేస్తే కొత్త పిలకలు వస్తాయన్నారు. ఐదు రోజులు దాటి ముంపులో ఉన్న నారుమడులు పనిచేయవన్నారు. మండలంలో 54ఎకరాల్లో నారుమడులు వేయాల్సిఉండగా 36 ఎకరాల్లో వేశారని, 21ఎకరాల్లో నారుమడులు మునిగిపోయ్యాయన్నారు. రాజశేఖర్, రామోహనరావు, రాకేష్ పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలంలో వర్షం ముంపు ప్రాంతాలను శనివారం నాయకులతో కలిసి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పరిశీలించారు. భారీ వర్షాలకు సఖినేటిపల్లిలంక గాంధీనగర్ కాలనీ ముంపునకు గురైంది. కాలనీ వాసులను ఎమ్మెల్యే పరామర్శించారు. వరద హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి లంక గ్రామాల ప్రజలను కోరారు. జోరుగా కురుస్తున్న వర్షాలకు సఖినేటిపల్లి మండలంలో పల్లపు ప్రాంతాలతో పాటు కాలనీలు జలమయమయ్యాయి. అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి వెళ్లే ప్రధాన రహదారిలో ఐదు కిలోమీటర్లు సీసీ రోడ్డు వేయడంతో ముంపునకు గురికాలేదు. మిగిలిన దేవస్థానం గ్రామంలో ఉన్న ప్రధాన రహదారి కాల్వతో సమానంగా నీట మునిగింది. ఈరహదారిలో వెళ్లే భక్తులు, స్థానికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. గోతుల్లో వాహనాలు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పలు పాఠశాలల ఆట స్థలాలు నీట మునిగాయి. కొన్నిచోట్ల కొబ్బరి తోటలు ముంపునకు గురయ్యాయి. సార్వా నారుమడులు నీట మునగడం, సార్వా ఊడ్పుని ప్రాంతాల్లో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి.

కపిలేశ్వరపురం: అంగర, పడమరఖండ్రిక పరిధిలో ముంపునకు గురైన పంటపొలాలను శనివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరిశీలించారు.నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పుత్సల శ్రీనివాస్, మత్సా గంగరాజు, సిద్దిరెడ్డి రామలింగేశ్వరరావు, త్రిపురశెట్టి నాని, కొమ్మిశెట్టి రాం బాబు, ఆచంట చిన్న, నెక్కంటి శ్రీరాంజీ, బండారు కొండయ్య, పిల్లా బసవరాజు, చీకట్ల గంగరాజు ఉన్నారు.

మామిడికుదురు: గోదావరికి వరద స్వల్పంగా పెరుగుతుండడంతో లంక గ్రామాల ప్రజలు భాయందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క ఎడతెరిపి లేకుండా వర్షాలు మరో పక్క వరద పెరుగుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. లంక గ్రామాలైన పెదపట్నం, అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి గ్రామాల్లోని ప్రజలు పశుగ్రాసాం, వంట చెరకును రక్షించుకునే పనిలో నిమగ్నమయ్యారు. అప్పనపల్లి పుష్కరాలరేవు వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతోంది.

పి.గన్నవరం: భారీ వర్షాలు కారణంగా వరి చేలల్లో ఉన్న ముంప నీరు దిగడానికి ఇబ్బందిగా ఉన్న బలహీనమైన కల్వర్టులను గుర్తించాలని ఆర్డీవో జి.వి.వి.సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. పలు డ్రెయిన్లను ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. పోతవరం ముగ్గుబట్టీ వద్ద ముంపు నీరు దిగడం లేదన్నారు. తాత్కాలికంగా డ్రెయిన్లలో పూడిక తీసి ముంపునీరు దిగే ఏర్పాటు చేశామన్నారు. పోతవరం, కె.ముంజవరంలో గోగ్రింకల డ్రైన్, డ్రైన్ గోదావరి నదిలో కలిసే చోట లాకులను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముగ్గుబట్టీలు వద్ద ప్రతి ఏడాది ఇదే పరిస్థితి వస్తుందని, ఈడ్రెయిన్‌పై 300ఎకరాలు దాటి ఆయకట్టు ఉందని, ఈసమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు రైతులు ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం తాత్కాలిక పరిష్కారం చేస్తున్నామని డిసెంబరు నెల దాటిన తరువాత పూర్తిస్థాయిలో సమస్యను పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట తహశీల్దార్ ఎస్‌కే హుస్సేన్, డ్రైన్ జేఈఈ ఆనందకిరణ్, ఇన్‌చార్జ్ ఆర్ఐ పి.నరసింహరావు, రైతులు, సిబ్బంది ఉన్నారు.


ఐ.పోలవరం: భారీ వర్షాలకు మండలంలో పంట పొలాలు జల దిగ్బంధమయ్యాయి. ఖరీఫ్ పంటకు ఆదిలోనే తుపాన్‌తో నష్టం రావడంతో రైతులు విలవిల్లాడుతున్నారు. మండలంలో మురుగుకాల్వలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో డ్రెయిన్ల నుంచి పొలాల్లో మురుగు నీరు బయటకు వెళ్లటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఎకరాకు పెట్టుబడి రూ.20వేలు అయిందని రైతులు తెలిపారు. మురుగుకాల్వలకు మరమ్మతులు చేసి మురుగునీరు దిగేలా చర్యలు తీసుకుని పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

రావులపాలెం: విస్తారంగా వర్షాలు కురవడంతో పాటు మరో పక్కవరద నీరులంక పొలంలోకి వచ్చి చేరుతున్న నేపథ్యంలో అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ జాగ్రత్తలు, సూచనలు అందజేయాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రౌతు ఈశ్వరరావు కోరారు. వర్షాల కారణంగా నాట్లువేసిన పంట పొలాలు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

ముంపు నుంచి రక్షణ అవసరం

ఉప్పలగుప్తం, జూలై 20: అధిక వర్షాలకు నీట మునిగిన సార్వా వరినారు మళ్లు, నాట్లు వేసిన పొలాలను భీమనపల్లిలో శనివారం వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తక్షణమే ముంపునీరు బయటకు పోయే మార్గాలు అన్వేషించాలని సూచించారు. మురుగు దిగిన అనంతరం చేపట్టాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. బృందంలో ప్రధాన శాస్త్రవేత్త, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ ఎం.నందకిశోర్, ఆనంద్, కృష్ణాజీ, దయాల్, మనోహర్, జి.కుమార్‌బాబు ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో తొలి షిర్డిసాయి ఆలయం



ఆలమూరు, జూలై 20: షిర్డిసాయి బాబా అంటే అంతగా ప్రచుర్యం లేని రోజుల్లోనే ఆలమూరులో బాబా ఆలయాన్ని నిర్మించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తొలిసారిగా ఆలమూరులో ఆలమూరు -రావులపాలెం మధ్య వారధి నిర్మించిన కాంట్రాక్టరు చెలంకూరి సుబ్బారావు ఈఆలయాన్ని 1956లో నిర్మించారు. షిర్డిలో ఉన్న బాబా విగ్రహాన్ని రూపొందించిన శిల్పి లాల్లిమ్ ఇక్కడ విగ్రహాన్ని చెక్కడం విశేషం. ఆలమూరు షిర్డిసాయిని దర్శించుకున్న భక్తులకు కలుగుతుంది. ఇంతటి ప్రసిద్ధి చెందిన ఆలయానికి సరైన ఆదరణ ఉండేది కాదు. మూడు దశాబ్దాల క్రితం మండపేటలో రవాణాశాఖ అధికారి కె.సాయోజీరావు ఇక్కడ ఆలయాన్ని దర్శించి స్థానికులతో ఆలయం గురించి చర్చించారు. ఆలయం ముందున్న షాపులను తొలగించి ఆలయం రోడ్డుపైకి కనిపించేలా చేయడంలో సాయోజీరావు విశేష కృషి చేశారు.

నేడు గురుపౌర్ణమి: ఈఆలయంలో ఆదివారం గురుపౌర్ణమిసందర్భంగా ఉత్సవాలకు భారీఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ చల్లా ప్రభాకరరావు తెలిపారు. ఉదయం నుంచి బాబాకు పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు.

ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ

అమలాపురం రూరల్, జూలై 20: అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం రాత్రి వరకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం కొనసాగింది. మధ్యాహ్నం సామాజిక తనిఖీని ప్రారంభించినప్పటికీ ప్రజావేదికకు హాజరైన డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ కలెక్టరేట్‌లో జరిగిన వీడియో కాన్ఫరెన్సుకు హాజరు కావడంతో రాత్రి తిరిగి తనిఖీని కొనసాగించారు. మండల పరిధిలోని 22గ్రామాల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వరకు చేపట్టిన పనులపై తనిఖీ జరిగింది. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మితో సహా ఏ ఒక్క ప్రజాప్రతినిధి హాజరుకాలేదు. అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో తనిఖీని కొనసాగించారు. ఉపాధిహామీ పథకంలో 1157పనులు చేపట్టగా వేతనాల కింద రూ.5,94,44,760 చెల్లించగా మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.1,84,524 నిధులు ఖర్చు చేశారు. మొత్తం రూ.5.96 కోట్లతో చేపట్టిన పనులపై గ్రామాల వారీగా సామాజిక తనిఖీని పీడీ మధుసూదన్ కొనసాగిస్తున్నారు. వీటితో పాటు ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ విభాగాల్లో జరిగిన పనులపై కూడా తనిఖీ జరుపుతున్నారు. తనిఖీలో డీవీవో భీమేశ్వరరావు, అసిస్టెంట్ డీవీవో సత్యనారాయణ, అంబుడ్స్‌మెన్ అడపా వెంకటశ్రీనివాసరావు, ఎస్ఆర్పీ కనకారావు, ఎంపీడీవో జి.మల్లికార్జునరావు, ఎ.శివకుమారి, ఆర్.సునీత, రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు పాల్గొన్నారు.

పశుశిక్షణా కేంద్రంలో అదనపు భవనాలు

మండపేట,జూలై20: రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేటలోని పశు శిక్షణా కేంద్రంలో రూ.కోటితో నిర్మించిన అదనపు భవనాల సముదాయాన్ని శనివారం వేగుళ్ల ప్రారంభించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, వార్డు కౌన్సిలర్ మలసాని సీతామహాలక్ష్మి, పశుసంవర్ధక శాఖాధికారులు డాక్టర్ వై.సింహచలం, శ్రీనివాసరావు, నాగమణి పాల్గొన్నారు.

పాడి రైతులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలి

పి.గన్నవరం, జూలై 20: వరద ప్రభావిత లంక ప్రాంతాల్లో పాడి రైతులు జాగ్రత్తలు పాటించాలని పి.గన్నవరం పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు ఎల్.విజయరెడ్డి సూచించారు. వరదల నేపథ్యంలో పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్‌చైతన్యతో కలిసి ఆయన గంటిపెదపూడి శివారు లంకప్రాంతాల్లో పర్యటించారు. లంకప్రాంతాల్లో వైద్య బృందాలను ఏర్పాటుచేసి రైతులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వరదల నేపథ్యంలో పశువులకు వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట పశువైద్య సహాయకులు కిరణ్, ప్రశాంతి, రమేష్, కంఠంశెట్టి ప్రసాద్, మణికొండ వెంకటరావు, కుసుమే వసంతరావు, ఉమ్మేటి విశాఖ ఉన్నారు.

చిరు వ్యాపారులకు సహకరించండి

అమలాపురం టౌన్, జూలై 20: చిరు వ్యాపారులకు పోలీసులు అండగా ఉండాలని ది అసోసియేషన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావును కోరారు. తాము పోలీసులకు సహకరిస్తామని పేర్కొన్నారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణారావును తాతాజీ ఆధ్వర్యంలో వర్తక వ్యాపారులు శనివారం మర్యాద పూర్వకంగా కలుసుకుని అభినందించి సత్కరించారు. ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు, వర్తక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్పీని సత్కరించారు. చిరు వ్యాపారులు గతంలో మాదిరిగా రాత్రి 11 గంటల వరకు వ్యాపారాలు చేసుకునే విధంగా సమయం పెంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యదర్శి కొమ్మూరి వెంకటాచలప్రసాద్, కోశాధికారి దొమ్మేటి సాయిబాబు, ముఖ్య సలహాదారుడు నల్లా పవన్‌కుమార్, మోకా వెంకటసుబ్బారావు, వలవల శివరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో సిబ్బందికి ప్రశంసా పత్రాలు

రావులపాలెం, జూలై 20: రావులపాలెం ఆర్టీసీ డిపోలో డీఎం కేడీఎంఎస్ కుమార్ ఆధ్వర్యంలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. జూన్ నెలలో అత్యధిక ఇంధన పొదుపు సాధించిన డ్రైవర్, కండక్టర్‌లకు ప్రశాంస పత్రాలు అందజేశారు. ఇంధనపొదపు సాధించిన డ్రైవర్లు పి.ప్రకాశరావు, సీహెచ్ గంగాధరరావు, ఎంఎం కృష్ణ, అలాగే అధిక ఆదాయం సంపాదించని కండక్టర్లు కేకే రావు, ఎం.శ్రీధర్, కె.జ్యోతికుమార్‌లను డీపీటీవో మేడిశెట్టి శ్రీనివాసరావు అందించిన ప్రశంస పత్రాలతో పాటు నగదు బహుమతులు అందించారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

మామిడికుదురు,జూలై 20: మామిడికుదురు గ్రామాభివృద్ధికి సహకరించాలని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అమలాపుర ఎంపీ గంటి హరీష్ మాధుర్‌ను కలిసి విన్నవించారు. శనివారం టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కంచి విశ్వనాథం ఆధ్వర్యంలో ఎంపీని కలిసి పుష్పగుచ్ఛంతో అభినందించారు. సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అప్పారి వెంకటేశ్వరరావు, సాపే ఏకాదశి, కడలి రంగ, పెచ్చెట్టి భాస్కరరావు, ఇంటి గణపతి పాల్గొన్నారు.

మాదిగ సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ కేటాయించాలి

మామిడికుదురు, జూలై 20: కూటమి విజయంలో పాత్ర పోషించిన మాదిగ సామాజికవర్గానికి ఎమ్మెల్సీ కేటాయించాలని ఆ వర్గ నాయకులు శనివారం జడ్పీ మాజీ ఛైర్మన్ నామన రాంబాబుకు ఆయన స్వగృహంలో కలిసి వినతిపత్రం అందించారు. కోనసీమ జిల్లా దండోరా అధ్యక్షుడు మోకాటి నాగేశ్వరరావుకు ఎమ్మెల్సీ ఇచ్చేలా సీఎంతో మాట్లాడాలన్నారు. కార్యక్రమంలో మడికి శ్రీరాములు, కె.నాగభూషణం, మడికి సత్యనారాయణ, వాడపల్లి రవీంద్ర, నూటుకుర్తి మూర్తి, ఎం.వెంకటేశ్వరరావు, అయినవిల్లి అర్జునరావు పాల్గొన్నారు.

బోధనా పద్ధతులు అభివృద్ధి పరుచుకోవాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 20: సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఉపాధ్యాయులు బోధనా పద్ధతులు అభివృద్ధి పరుచుకోవాలని డీఈవో ఎం.కమలకుమారి అన్నారు. శనివారం స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టీచ్‌టూల్ అబ్జర్వర్స్ శిక్షణ కేంద్రాన్ని డీఈవో సందర్శించారు. శిక్షణా శిబిరంలో సౌకర్యాలను ఉపాధ్యాయులను అడిగితెలుసుకున్నారు. ఏఎంవో పి.రాంబాబు మాట్లాడుతూ జిల్లాలో 3ట్రైనింగ్ సెంటర్లలో 417మందికి అబ్జర్వర్స్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీవైఈవో ఎస్.నరసింహఫణి, ఎంఈవో ఎం.శ్రీనివాస్, నాగేశ్వరి, సెక్టోరియల్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

రాయవరం, జూలై 20: సోమేశ్వరం శ్రీబాలాత్రిపురసుందరి సమేత సోమేశ్వరస్వామిని శనివారం తెలంగాణ హైకోర్టు జడ్జి సాంబశివరావునాయుడు దంపతులు, కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. ఈవో సత్యనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ జడ్జికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. జడ్జి దంపతులు, కుటుంబసభ్యులకు వేద ఆశీర్వచనాలు అందజేశారు. గ్రామస్తులు జడ్జి దంపతులను పూలమాలలతో సత్కరించారు. సోమేశ్వరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వైట్ల రాంబాబు, నాగదేవర అమ్మిరాజు, తాతాజీ, సుబ్బారావు, గరగ వెంకటేశ్వరరావు, శ్రీను, టేకుమూడి చక్రం, ఆలమూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జె.సత్యనారాయణ పాల్గొన్నారు.

పాస్టర్ల ఫెలోషిప్ కార్యవర్గ ఎన్నిక

ఆత్రేయపురం,జూలై20: మండలపాస్టర్లు ఫెలోషిప్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం శనివారం సెయింట్ థామస్ లూథరన్ దేవాలయంలో కొత్తపేట జేఏసీ అధ్యక్షుడు డేవిడ్‌రాజు అధ్యక్షతన జరిగింది. అధ్యక్షుడిగా అరుణకుమార్, గౌరవాధ్యక్షుడిగా ఏసురాజు, ఉపాధ్యక్షుడిగా వెంకట్రావు, సెక్రటరీగా దైవానంద్, జాయింట్‌సెక్రటరీగా శరత్, ట్రెజరర్‌గా స్టీఫెన్లను ఎన్నుకున్నారు.

నేటి సమాజంలో ధ్యానం ప్రతి ఒక్కరికీ అవసరం


ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలకు సన్మానం

మండపేట, జూలై 20: నిత్యం మానసిక ఒత్తిడి నేపథ్యంలో మానవాళికి ఆధ్యాత్మికత దైవచింతనతో పాటు ధ్యానం ఎంతో అవసరమని మండపేట, అనపర్తి ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. తాపేశ్వరంలోఉన్న వేడుక ఫంక్షన్‌హాల్‌లో నల్లమిల్లి విజయభాస్కరరెడ్డి, అన్నపూర్ణ దంపతుల ఆధ్వర్యంలో శనివారం రెండురోజులు జరిగే గురు పౌర్ణమి ధ్యానం, జ్ఞానయజ్ఞం కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. శనివారం ఆధ్యాత్మిక వేత్త యర్రాప్రగడ రామకృష్ణ ఆధ్యాత్మిక ఉపన్యాసం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు వేగుళ్ల, నల్లమిల్లిలను, సాహితీవేత్త రామకృష్ణను విజయ భాస్కరరెడ్డి దంపతులు సత్కరించారు.

ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 20: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తు తీర్చి దిద్దుకోవాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం రామచంద్రపురంలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్స్, యూనిఫారంతో కూడిన కిట్లు మంత్రి సుభాష్, కలెక్టరు ఆర్.మహేష్ కుమార్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు బోధిస్తూ మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి విశ్లేషణాత్మ బోధన తప్పనిసరిగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంఈవోలు ఎం.శ్రీనివాస్, విత్తనాల సుబ్బారావు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

జిల్లాలో 56 లెప్రసీ కేసులు నమోదు

అంబాజీపేట, జూలై 20: జిల్లాలో లెప్రసి సర్వే ప్రతి గ్రామంలో జరుగుతుందని, ఇప్పటి వరకు 56మంది లెప్రసీ రోగులను గుర్తించామని ఎస్పీడీసీ జిల్లా అధికారిణి సీహెచ్ భారతి తెలిపారు. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలనలో భాగంగా అంబాజీపేటలో జరుగుతున్న సర్వేను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా భారతి మాట్లడతూ గత ఏడాది జిల్లాలో 101మంది లెప్రసి కేసులను గుర్తించాన్నారు. ఈఏడాది 56కేసులు ఉన్నాయన్నారు. ఈనెల18 నుంచి ఆగస్టు 2వరకు జిల్లాలో లెప్రసి సర్వే ప్రతి గ్రామంలో వైద్య సిబ్బంది చేస్తారన్నారు. అనంతరం మాచవరం, గంగలకుర్రు అగ్రహారం గ్రామాల్లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి వి.గౌతమి, పీహెచ్ఎన్ రత్నకుమారి, హెల్త్‌అసిస్టెంటు ఎస్.మధుబాబు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

ఉప్పలగుప్తం, జూలై 20: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్ అధ్యక్షతన ఆయన స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఎంఈవోలు కె.కిరణ్‌బాబు, సత్తి సత్యకృష్ణ , ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, ఎంపీటీసీ నాగులపల్లి శేషారత్నం, ఉపసర్పంచ్ కోలపల్లి గోపి, కూటమి నాయకులు మంచెం బుజ్జి, ఆకేటి పెద్ద పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

కపిలేశ్వరపురం, జూలై 20: అంగర గ్రామానికి చెందిన నున్నా నరేష్(38) హత్య కేసులో ఐదుగురు నిందితులను శనివారం అంగర పోలీసులు అరెస్ట్ చేశారు. అంగర పోలీస్‌స్టేషన్‌లో నిందితుల వివరాలను శనివారం మండపేట రూరల్ సీఐ శ్రీధర్ వెల్లండించారు. గ్రామానికి చెందిన నరేష్ మతిస్థిమితం లేక గ్రామస్తులతో తరచూ గొడవలు పడుతూ ఉండేవాడు. తన నివాస సమీపంలోని గుత్తుల పోతురాజు తండ్రితో నరేష్ గొడవపడ్డాడు. దీంతో ఆగ్రహం చెందిన పోతురాజు ఈనెల15న నెల్లి శ్రీను, కొనాల రాంబాబు, మాతా శ్రీను, దాయం రాంబాబు సహాయంతో నరేష్‌ను సెంట్రింగ్ రాడ్, కర్రలతో కొట్టించపారు. మరుసటి రోజు చనిపోయి ఉన్న నరేష్ మృతదేహానికి బంధువుల అంత్యక్రియలు నిర్వహించారు. తొలుత నరేష్ అనుమనాస్పదంగా మృతి చెందినట్టు భావించారు. రక్తపు మరకలు ఉండటంతో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. ఈహత్య కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టుకు హాజరుపర్చారు. నిందితులకు కోర్టు 14రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ శ్రీధర్, అంగర ఎస్ఐ పరదేశి తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వకుండా అంత్యక్రియలు నిర్వహించిన బంధువులపై కూడా కేసు నమోదు చేసినటు తెలిపారు.

కూలిన పెంకుటిల్లు పైకప్పు.. తప్పిన పెనుప్రమాదం

కొత్తపేట, జూలై 20: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో అవిడి గ్రామంలో ఐదు కుటుంబాలు నివసిస్తున్న పెద్ద పెంకిటిల్లు పైకప్పు శుక్రవారం అర్ధరాత్రి కుప్పకూలింది. ఈఇంట్లో ఐదు కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. ఈప్రమాదంలో వృద్ధురాలు పాముల పల్లాలమ్మ తలకు తీవ్రగాయమైంది. మిగిలిన కుటుంబ సభ్యులు సురక్షితంగా బయటపడటంతో పెనుప్రమాదం తప్పింది. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు బాధిత కుటుంబాలను పరామర్శించారు. తక్షణసాయం కింద 4కుటుంబాలకు ఎమ్మెల్యే బండారు ఆర్థిక సాయం అందించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

బాలుడి అదృశ్యంపై కేసు

మండపేట, జూలై20:బాలుడి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండపేట సంఘం కాలనీకి చెందిన 14ఏళ్ల బాలుడు కొండా స్వామికుమార్ ఈనెల 18న పాఠశాలకు వెళ్లాడు, పాఠశాల నుంచి స్నేహితుడు రాజు వద్దకు వెళ్లి అక్కడ స్కూల్‌బ్యాగ్ పెట్టి, రూ.500తీసుకుని హైదరాబాద్ లేదా గౌరీపట్నం వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. కుమార్ ఇంటికి తిరిగి రాకపోవడంతో శనివారం కుమార్ తండ్రి కొండరాజు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణ ఏఎస్ఐ జి.చిన్నారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ

పి.గన్నవరం, జూలై 20: తాళంవేసి ఉన్న ఇంట్లో దొంగలు పడ్డారు. నాగుల్లంక గ్రామానికి చెందిన గ్రంధి అన్నపూర్ణ హైదరాబాదు వెళ్లింది. ఇంటిని పనిమనిషి ప్రతిరోజు శుభ్రంచేస్తుంది. ఈనెల19న ఉదయం పనిమనిషి శుభ్రం చేయడానికి వెళ్లగా ఇంటి తాళం పగులుగొట్టి ఉండటాన్ని గమనించింది. దీంతో హైదరాబాద్‌లో ఉన్న అన్నపూర్ణకు సమాచా రం ఇచ్చింది. శనివారం ఉదయం ఆమె ఇంటికి వచ్చింది. రూ.37,500నగదు, 21 గ్రాముల బంగారం, రెండు కిలోల వెండి అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అమలాపురం క్లూస్‌టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.శివకృష్ణ తెలి పారు. అదేరోజు అర్ధరాత్రి అదే గ్రామంలో వినాయకుని ఆలయం, ఆంజనేయ స్వామి ఆలయాల్లో హుండీలు చోరీకి గురైనట్లు ఆలయకమిటీ గుర్తించినట్టు తెలిసింది.